సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
ఆదివారం । 29 । జూన్ । 2025



నా కుమారుడు మఠాధిపతిగా అర్హుడు

వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి తన పెద్ద కుమారుడు గోవిందస్వామి మఠాధిపతిగా అర్హుడని పూర్వపు మఠాధిపతి ద్వితీయ భార్య మారుతీ మహాలక్షుమ్మ తెలిపారు. -8లో



రైతులకు నష్టం వాటిల్లకుండా పరిహారం

రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణలో భాగంగా రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని జేసీ గ్ ఆదేశించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.4/26.5

జిల్లాలో శనివారం 26.5- 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 16.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో ఈనెల 30న సోమవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా జనార్దన్



కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా జనార్దన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న బి.సురేంద్రారెడ్డి తాడిపత్రి అల్ట్రాటెక్ సిమెంట్ విభాగానికి బదిలీ అయ్యారు. ఎర్రగుంట్లలో పనిచేస్తున్న జనార్దన్‌ను కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

11 నుంచి పీజీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈఎడీ, ఎం.సి.ఎ రెండో సెమిస్టర్ విద్యార్థులకు జులై నెల 11 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

పక్కాగా బదిలీ ప్రక్రియ

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మేరకు పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పంచాయతీరాజ్ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ జీవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం తమ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. 377 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజంపేట ఈఈ రామచంద్ర నాయక్, రాయచోటి ఈఈ దయాకర్‌రెడ్డి, బద్వేలు ఈఈ లక్ష్మిపతిరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగిన కౌన్సెలింగ్

కడప కార్పొరేషన్: వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ రెండో రోజు కొనసాగింది. శనివారం ఉదయం 7.30 గంటల నుంచి వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు, వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ సెక్రటరీలకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. అత్యధిక శాతం మందికి ఏ మున్సిపాలిటీలో పని చేస్తుంటే ఆ మున్సిపాలిటీ పరిధిలోనే బదిలీలు చేశారు. స్పౌజ్ కేసులు, మెడికల్ సంబంధిత కేసులు, ఉద్యోగుల అభ్యర్థన మేరకు ఒక మున్సిపాలిటీ నుంచి మరొక మున్సిపాలిటీకి కూడా బదిలీలు నిర్వహించారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, ప్రొఫెసర్లు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధం కళాశాలల డిగ్రీ హానర్స్ పరీక్ష ఫలితాలను వీసీ శ్రీనివాసరావు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కెఎస్వీ కృష్ణారావు తో కలసి విశ్వవిద్యాలయంలోని తన చాంబర్లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు ఫలితాల కోసం https:www.yvu exam s.in/results.aspx అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని కృష్ణారావు సూచించారు. పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు సుభోస్ చంద్ర, గణేష్ పాల్గొన్నారు.

బదిలీల వేళ.. పచ్చ నేతల దందా!

- కౌన్సెలింగ్ కేంద్రంలో 'దేశం' నేతలు
- వ్యవసాయశాఖ బదిలీల్లో సిఫారసులకే పెద్ద పీట!
- స్పౌజ్ కేసులకు, మెడికల్ గ్రౌండ్స్‌కు ప్రాధాన్యత కరువు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఉద్యానశాఖ అధికారులు



నోటీసు బోర్డులో సీనియారిటీని పరిశీలించుకుంటున్న ఉద్యోగులు

కడప అగ్రికల్చర్: బదిలీల్లో నేతల సిఫారసులకే పెద్ద పీట వేస్తున్నారా..? పెద్ద ఎత్తున నగదు చేతులు మారుతున్నాయా? లెటర్ల పేరిట పచ్చ నేతలు దందా సాగిస్తున్నారా?... అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. తాజాగా జరుగుతున్న వ్యవసాయ, ఉద్యాన సహాయకుల కౌన్సెలింగ్ కేంద్రానికి 'దేశం' నేతల రాక దీనికి మరింత బలం చేకూరిస్తోంది. వెరసి కూటమి హయాంలో బదిలీలంటనే ఉద్యోగులు హడలెత్తిపోతున్న పరిస్థితి నెలకొంది. వివరాలల్లోకి వెళితే.. గ్రామ సచివాలయాల్లో ఐదేళ్లుగా పనిచేస్తున్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శనివారం కలెక్టరేట్‌లోని ఉద్యాన, వ్యవసాయశాఖల్లో బదిలీ కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఈ ప్రక్రియలో అధికార ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకే ప్రాధాన్యం ఇచ్చినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది తమకు అనుకూల స్థానాలకు స్థానిక ఎమ్మెల్యేల నుంచి లెటర్లతోపాటు ఫోన్‌లలో కూడా సిఫారసు చేసినట్లు కౌన్సెలింగ్ కేంద్రంలో చర్చ సాగింది. అధికారులు వాటికే పెద్దపీట వేశారన్న ఆరోపణలు వినిపించాయి. ఇందుకు బలం చేకూరుస్తూ కడప నగరానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు హరిప్రసాద్ కౌన్సెలింగ్ కేంద్రానికి వచ్చి అధికారులతో మాట్లాడి తనకు అనుకూలమైన వారికి వారు కోరుకున్న స్థానాలను ఇప్పించినట్లు చర్చసాగింది.

ఉద్యోగుల్లో అసంతృప్తి

ఈ బదిలీల్లో స్పౌజ్‌కు అసలు ప్రాధాన్యత కల్పించలేదని వ్యవసాయ, ఉద్యోగశాఖ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఐదేళ్లగా దూర ప్రాంతంలో పని చేసి ఇప్పుడు 'స్పౌజ్' కేటగిరీలో ఉన్నా మళ్లీ దూరప్రాంతాలకే వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కొంతమంది వికలాంగులకు కూడా అన్యాయం జరిగినట్లు తెలిసింది. అసలు మెడికల్ గ్రౌండ్స్ పరిగణలో లోకి తీసుకోలేదని పలువురు వాపోయారు. ఈ బదిలీల్లో ఎలాంటి నిబంధనలను పాటించకుండా కౌన్సెలింగ్‌ను నిర్వహించారని పలువురు ఉద్యాన, వ్యవసాయ సహాయకులు వాపోయారు.



ఉద్యానశాఖ కార్యాలయానికి వచ్చి వెళ్తున్న కడపకు చెందిన టీడీపీ నాయకుడు హరిప్రసాద్

కనీస వసతులు కరువు

కౌన్సెలింగ్ కోసం వచ్చిన వ్యవసాయ, ఉద్యోగ సహాయకులకు అధికారులు ఎలాంటి సౌకర్యాలను కల్పించలేదు. కూర్చొనేందుకు కుర్చీలు లేక కొంత మంది నేలపై, , కార్యాలయ వసారాలలో కూర్చొని ఊసూరుమన్నారు. మరి కొంతమంది చిన్న బిడ్డల తల్లులు తమ పిల్లలకు పాలు తాపించేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. కనీసం మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదని ఉద్యోగులు వాపోయారు.



నేలపైన కూర్చొని దరఖాస్తు నింపుతున్న ఉద్యోగులు

వ్యవసాయ సహాయకులకు సంబంధించి...

జిల్లావ్యాప్తంగా పలు రైతు సేవా కేంద్రాలలో పనిచేసే 264 మంది వ్యవసాయ సహాయకులు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఈ బదిలీలకు అర్హత సాధించారు. ఇందులో తొలి రోజు 175 మందికి కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఇందులో సీనియారిటీ ప్రకారం ఐదేళ్ల పూర్తి చేసుకున్న వారికి ర్యాంకులు కేటాయించారు. అ ర్యాంకుల ప్రకారం కౌన్సెలింగ్‌కు పిలిపించి స్థానాలను కేటాయించారు. ఈ బదిలీల్లో ఏమాత్రం పారదర్శకత పాటించలేదని ఎమ్మెల్యేల లెటర్స్‌కే ప్రాధాన్యత కల్పించారని పలువురు వ్యవసాయ సహాయకులు తెలిపారు. ఈ విషయంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్‌తో మాట్లాడుతూ ఈ బదిలీలను పారదర్శకంగా నిర్వహించామని ఎలాంటి రెకమండేషన్లను పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు. ఏడీఏ మాధవి, అన్నమయ్య జిల్లా ఏడీ మజీద్ ఆహ్మద్, సూపరింటెండెంట్ విజయశ్రీ, ఏవో శ్రీహరి పాల్గొన్నారు.

ద్యాన సహాయకులకు సంబంధింది...

ఉద్యాన సహాయకులకు సంబంధించి కూడా 177 మంది ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని బదిలీలకు అర్హత సాధించారు. వీరికి సంబంధించిన బదిలీలలో కూడా పలు ఆరోపణలు వినిపించాయి. ఈ బదిలీ కౌన్సిలింగ్ గురించి జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ బదిలీలను చాలా పారదర్శకంగా నిర్వహించామన్నారు. అన్నమయ్య డీహెచ్‌ఓ సుబాషిణి, ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పంజంకు కన్నీటి వీడ్కోలు!



నివాళులు అర్పిస్తున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి తదితరులు



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల, ప్రభావతమ్మ తదితరులు

- కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- సుకుమార్‌రెడ్డి పార్థివదేహం వద్ద నివాళులర్పించిన పెద్దిరెడ్డి, అంజద్‌బాషా తదితరులు

సాక్షి రాయచోటి/రైల్వేకోడూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి (64)కి పార్టీ నేతలు, శ్రేణులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచిన విషయం అందరికీ తెలిసిందే. శనివారం ఉదయం అంత్యక్రియుల నిర్వహించారు. అంతకుముందు అన్నమయ్య, వైఎస్సార్ కడప, తిరుపతితో పాటు ఇతర జిల్లాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు కన్నీటి నివాళి అర్పించారు.

నేతల నివాళి

రైల్వేకోడూరు మండల పరిధిలోని అనంతరాజుపేట పంచాయతీ తూర్పుపల్లిలో పంజం సుకుమార్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్న పార్టీ కీలక నేతలు నివాళులర్పించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, కడప పార్లమెంట్ పరిశీలకులు, స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ తదితరులు నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజం సుకుమార్‌రెడ్డి మృతి చెందారన్న విషయం తెలుసుకుని శుక్రవారం రైల్వేకోడూరుకు వచ్చిన సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి పంజం సుకుమార్‌రెడ్డి పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సుకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పంజం సందీప్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపాన్ని తెలియజేశారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఘనంగా అంతిమ వీడ్కోలు

తూర్పుపల్లిలోని పంజం సుకుమార్‌రెడ్డి ఇంటి వద్ద నుంచి అంతిమ యాత్ర సాగింది. పార్టీ శ్రేణులు, నేతలు, గ్రామస్తులు, కుటుంబీకులు పాల్గొన్నారు. పంజం సుకుమార్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద అంత్యక్రియలు నిర్వహించారు.



తిరుపతి-నాందేడ్ మధ్య ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి-నాందేడ్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లను నడవనున్నట్లు అధికారులు తెలిపారు. 07189 రైలు జులై 4 నుంచి 25 వరకు నాందేడ్-తిరుపతి మధ్య, 07190 నెంబరుగల రైలు తిరుపతి-నాందేడ్ మధ్య జులై 5 నుంచి 26 వరకు,07015 నెంబరుగల రైలు నాందేడ్-తిరుపతి మధ్య జులై 5 నుంచి 26వ తేది వరకు, 07016 నెంబరుగల రైలు తిరుపతి-నాందేడ్ మధ్య జులై 6 నుంచి 27 వరకు నడుస్తాయని వెల్లడించారు. ప్రతి శుక్రవారం నాందేడ్‌లో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి బాసర, నిజామాబా ద్, కామారెడ్డి, మేడ్చల్, చర్లపల్లి, నల్లగొండ, గిద్దలూరు, నంద్యాల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు చేరుతుందన్నా రు. ఇదే మార్గంలో ప్రతి శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు తిరుపతి నుంచి బయలు దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు నాందేడ్ చేరుతుందన్నారు. మరో రైలు ప్రతి శనివారం నాందేడ్‌లో సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి బాసర, నిజామాబా ద్, కామారెడ్డి, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, ఎర్రగుంట్ల, కడప మీదుగా తిరుపతికి మరుసటిరోజు ఉదయం 10.10 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైలు ఇదే మార్గంలో ప్రతి ఆదివారం తిరుపతిలో సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం నాందేడ్ చేరుతుందన్నారు.



స్టీల్ ప్లాంట్ భూముల పరిశీలన

- రెండు మూడురోజుల్లో రెగ్యులర్‌గా పనులు ప్రారంభించే అవకాశం
- భూములు పరిశీలించిన జిందాల్ ప్రతినిధులు



భూముల వివరాలను పరిశీలిస్తున్న సీనియర్ సర్వేయర్

జమ్మలమడుగు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో భూ కేటాయింపులు చేసిన ప్రాంతంలోనే స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి జిందాల్ కంపెనీ ముందుకొచ్చింది. ఇటీవల కడపలో జరిగిన మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో స్టీల్‌ప్లాంట్ పనులను జిందాల్ కంపెనీ యాజమాన్యం మొదటి విడత పనులు రూ.4500 కోట్లతో చేపడుతుందని ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం కడపకు చెందిన ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జిందాల్ ప్రతినిధులు మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె గ్రామం వద్ద స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన భూముల వివరాలను మ్యాప్‌ల ద్వార పరిశీలించారు. ఈ సందర్భంగా మరో రెండు రోజులు ఇక్కడే ఉండి పరిశీలిస్తారని.. సోమవారం నుంచి కంపెనీ యాజమాన్యం పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అధికారులు వివరించారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న స్టీల్ ప్లాంట్ పనులకు మోక్షం రాబోతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సర్వేయర్ హరి ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

విరిగి పడిన చెట్టు



రోడ్డుకు అడ్డంగా విరిగి పడిన చెట్టు

అట్లూరు : కడప–బద్వేలు ప్రధాన రహదారిపై రెడ్డిపల్లి దగ్గర చెట్టు విరిగి పడడంతో ప్రమాదం తప్పింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వీచిన గాలులకు కడప–బద్వేలు ప్రధాన రహదారి పక్కన ఉన్న వేప చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. అయితే అర్ధరాత్రి సమయం కావడంతో వాహన రాక పోకలు లేవు. దీంతో ప్రమాదం తప్పింది. ఉదయం వాహన రాకపోకలకు చెట్టును తొలగించక పోవడంతో పూర్తి అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికుల సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించారు.

రైతులకు నష్టం వాటిల్లకుండా పరిహారం

జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణలో భాగంగా ఉద్యాన పంటలు, వృక్షాలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణలో ఉద్యాన పంటలు, చెట్లు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అంచనా ప్రక్రియపై శనివారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి సంబంధిత అధికారులు, ఆయా డివిజన్ల ఆర్డీఓలు, తహసీల్దార్లతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షకు ఎస్డీసీ, ఎన్‌హెచ్ పీడీ వెంకటపతి, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు సాయిశ్రీ, చిన్నయ్య సంబంధిత రీజియన్ల ఎన్‌హెచ్ఏఐ, ఎన్‌హెచ్ పీడీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బెంగళూరు–కడప–విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపడుతున్నామన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో జమ్మలమడుగు, వి.ఎన్. పల్లె మండలాల్లో ఉద్యాన పంటలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం రాకుండా.. భూసేకరణ చట్టంలోని సంబంధిత ప్రామాణికాలను పక్కాగా పాటిస్తూ.. పరిహారం అంచనాలను నివేదించాలన్నారు. చెట్ల వయస్సు, చెట్ల పెంపకానికి ఎరువులు, ఫర్టిలైజర్స్ ఇతర నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు రైతులు వెచ్చించిన వ్యయం తదితర అంశాలను ఉద్యాన వన శాఖ అధికారులు కచ్చితంగా, పారదర్శకంగా వ్యాల్యూయేషన్ చేయాలన్నారు. ఇం పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ పీడీ అశోక్ కుమార్, ఆర్–బి నేషనల్ హైవే ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎన్‌హెచ్ ప్రాజెక్టుల ప్రతినిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ప్రక్రియను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగే అడ్మిషన్ల ప్రక్రియను ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఉద్యోగులు విజయవంతం చేయాలని ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా కోరారు. శనివారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియపై ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోని సెంట్రల్ లైబ్రరీలో అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఈనెల 30, జూలై 1న రెండు రోజుల పాటు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అడ్మిషన్లకు ఎంపికైన విద్యార్థులకు ఇప్పటికే కాల్ లెటర్లు కూడా పంపామన్నారు. కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు మూడు సెట్లు జిరాక్స్ పత్రాలను, విద్యార్థి ఫొటోతోపాటు తల్లిదండ్రుల, సంరక్షకుల ఫొటోలను కూడా వెంట తీసుకుని రావాలన్నారు. సమావేశంలో అకడమిక్ డీన్ రమేష్ కైలాస్, అసోసియేట్ డీన్స్, సెక్యూరిటీ అధికారులు, పీఆర్ఓలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



వృద్ధుని మృతదేహం

కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి ఈనెల 26వ తేదీన గుర్తు తెలియని వృద్ధుడిని (60) వైద్య పరీక్షల కోసం తీసుకుని వచ్చారు. అతను మృతి చెందడంతో మార్చురీకి తరలించారు. అతని ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో సంప్రదించాలని రిమ్స్ అధికారులు కోరారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

- పంచాయతీ కార్యదర్శులపై విపరీతమైన పని ఒత్తిడి
- ఐవీఆర్ఎస్ రద్దు చేయాలి
- సచివాలయ విధులు మాకొద్దు
- ఏపీ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా



కడప కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కడప సెవెన్‌రోడ్స్ : తమపై విపరీతంగా మోపిన పని భారాన్ని తక్షణమే తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ శాఖకు లేని ఐవీఆర్ఎస్ పంచాయతీరాజ్‌శాఖకు విధించడం ఏమిటంటూ నిలదీశారు. పెరిగిన పనిభారాన్ని వ్యతిరేకిస్తూ శనివారం కడప అంబేడ్కర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది పంచాయతీ కార్యదర్శులు తరలివచ్చారు. ఏపీ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అన్వర్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో తాము విపరీతమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నామన్నారు. ఉదయం 6 గంటల నుంచి పారిశుద్ధ్య పనులు మొదలుకొని గ్రామ, వార్డు సచివాలయ సర్వేలు, గూగుల్ మీటింగ్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు, స్ప్రెడ్ షీట్, వివిధ యాప్స్‌లో ఫొటోలు, వీడియోలు అప్‌డేట్ చేయడం, ఇందుకోసం ప్రజల మొబైల్ ఫోన్ల నుంచి ఓటీపీలు సేకరించడం తదితర పనులు అప్పగిస్తున్నారని తెలిపారు. సత్వరమే ఐవీఆర్ఎస్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రలను పంచాయతీలకే అప్పగించి పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కేవలం రూ. 6 వేలు మాత్రమే గౌరవ వేతనంగా ఇస్తుండడంతో పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ఈ గౌరవ వేతనాలను గ్రామ పంచాయతీల గ్రాంట్ల నుంచి పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. చెక్‌పవర్ సర్పంచ్‌కు ఉన్నప్పటికీ వారి గౌరవ వేతనాలు చెల్లించడానికి పంచాయతీ కార్యదర్శులను ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. తమను గ్రామ పంచాయతీ విధుల నిర్వహణకు మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. సమాఖ్య నాయకుడు సాయిప్రతాప్‌రెడ్డి, సునీల్, లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు నిధులు, మానవ వనరులను ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల మూల వేతనం సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు జి.భాస్కర్, సీఎం గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



కడప నగరంలో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : ప్రతి శనివారం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు నడిపే వారు కచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్లకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నా కుమారుడు మఠాధిపతిగా అర్హుడు

విలేకరుల సమావేశంలో మారుతీ మహాలక్షుమ్మ



మాట్లాడుతున్న పూర్వపు మఠాధిపతి రెండవ భార్య మారుతీ మహాలక్షుమ్మ, ఆమె పెద్ద కుమారుడు

బ్రహ్మంగారిమఠం: పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి తన పెద్ద కుమారుడు గోవిందస్వామి మఠాధిపతిగా అర్హుడని పూర్వపు మఠాధిపతి ద్వితీయ భార్య మారుతీ మహాలక్షుమ్మ తెలిపారు. శనివారం బి.మఠంలో మహా నివేదిన మందిరంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి పెద్ద కుమారులు నలుగురిలో ఏ ఒక్కరూ మఠం ఆచారాలు పాటించలేదని అందుకు వారికి అర్హత లేదనేది పూర్వపు మఠాధిపతి వాదన అన్నారు. తన పెద్దకుమారుడు గోవిందస్వామి మఠం ఆచారాలపై ఎక్కువ మక్కువగా ఉండడంతో 2018లో పూర్వపు మఠాధిపతి వీలునామా రాశారన్నారు. తన తరువాత మఠాధిపతిగా తన రెండవ భార్య మొదటి సంతానం గోవిందస్వామి నియామకం జరగాలనేది పూర్వపు మఠాధిపతి ఆదేశం అన్నారు. వీలునామా ప్రకారం మఠాధిపతి నియామకం జరగాలని తాను కోరుతున్న సమయంలో పూర్వపు మఠాధిపతి పెద్ద భార్య కుమారులు అడ్డుతగలడంతో కోర్టును ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కోర్టు కూడా మఠాధిపతిని నిర్ణయించే బాధ్యత ధార్మిక పరిషత్‌కు అప్పజెప్పిందన్నారు. ధార్మిక పరిషత్ ద్వారా తమకు న్యాయం జరగక పోతే మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామని ఆమె వివరించారు.

ఖైదీల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని



కడప కేంద్ర కారాగారంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

కడప అర్బన్ : ఖైదీలు తమ ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని కడప కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాన్ని ఆమె జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఖైదీలతో మాట్లాడి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు. కారాగారం పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగారం సూపరింటెండెంట్, ఇన్‌చార్జి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్ రాజేశ్వర్ రావు, ప్రత్యేక మహిళా కారాగారం సూపరింటెండెంట్ కృష్ణవేణి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పారా లీగల్ వలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

పసికందును అపహరించిన మహిళ అరెస్టు



తల్లి చెంతకు చేరిన పసికందు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక లక్ష్మీ హాలు సమీపంలో నివాసముంటున్న రాజకుళ్లాయమ్మ అనే మహిళ ఈనెల 18న కడప రిమ్స్‌లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఐదు రోజుల క్రితం రాజకుళ్లాయమ్మ కడప రిమ్స్ నుంచి పుట్టింటికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే పసికందును రాజకుళ్లాయమ్మ స్నేహితురాలు కుమారి అపహరించి తీసుకెళ్లింది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితురాలు కుమారి తమ బంధువుల ఇంటి దగ్గర ఉండడంతో పులివెందుల పోలీసులు ఆమెను అరెస్టు చేసి పులివెందుల స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ మాట్లాడుతూ రాజకుళ్లాయమ్మ, కుమారి ఇద్దరూ పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నారని తెలిపారు. కుమారి శుక్రవారం రాజకుళ్లాయమ్మ ఇంటి దగ్గరికి వెళ్లి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పసికందును అపహరించి తీసుకెళ్లిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 24 గంటల్లోనే పసికందును కిడ్నాప్ చేసిన నిందితురాలిని అరెస్ట్ చేశామన్నారు. కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులను ఆయన అభినందించారు.

డ్రాగా ముగిసిన కడప–కర్నూలు మ్యాచ్



135 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ కారుణ్య ప్రసాద్



89 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ షాహుల్ హమీద్



100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన విష్ణు వర్ధన్ నాయుడు



72 పరుగులు చేసిన కర్నూలు బ్యాట్స్‌మన్ సాయి గణేష్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లో భాగంగా శనివారం మూడో రోజు కడప–కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. 14 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 97 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 331 పరుగులు చేసింది. ఆ జట్టులోని విష్ణువర్ధన్ నాయుడు 134 బంతుల్లో 100 పరుగుల సెంచరీ చేసి నాటౌట్‌గా నిలిచాడు. సాయి గణేష్ 72 పరుగులు చేశాడు. కడప జట్టులోని శివశంకర్ 3 వికెట్లు, ఆర్థిత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో 765 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో 6 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన నెల్లూరు–అనంతపురం మ్యాచ్‌లో అనంతపురం జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. శనివారం మూడో రోజు 173 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 99.2 ఓవర్లలో 405 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 211 బంతుల్లో 135 పరుగులు, షాహుల్ హమీద్ 89 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టీవీ సాయి ప్రతాప్ రెడ్డి 3 వికెట్లు, కేహెచ్ వీరారెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 24.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసి విజయం సాధించింది. ఆ జట్టులోని కేహెచ్ వీరారెడ్డి 37 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని షాహుల్ హమీద్ 2 వికెట్లు తీశాడు.

దేవుని కడప ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం



దేవునికడప ఆలయంలోని వివిధ ప్రాంతాలను పరిశీలిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

కడప సెవెన్‌రోడ్స్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని తిరుమల–తిరుపతి దేవస్థానం జేఈఓ వల్లూరు వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన దేవుని కడప ఆలయాన్ని సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆలయ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న బాలాలయం కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. గర్భాలయం, పోటుగదిలో వర్షపు నీరు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. పుష్కరిణి వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓలు నటేష్‌బాబు, ప్రశాంతి, ఈఈలు నాగరాజు, సుమతి, ఆలయ అర్చకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి టీసీ ఇవ్వడంపై ఆందోళన



లోకేశ్వరి తల్లిదండ్రులు

మైదుకూరు : మైదుకూరు మండలం వనిపెంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కె.లోకేశ్వరి అనే విద్యార్థినికి ప్రిన్సిపాల్ టీసీ ఇచ్చి పంపడంపై విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. వనిపెంట ఎస్సీ కాలనీకి చెందిన లోకేశ్వరి గురుకుల పాఠశాలలో 6వ తరగతి పూర్తి చేసుకుంది. 7వ తరగతిలోకి ప్రవేశించాల్సి ఉన్న ఆ విద్యార్థిని పాఠశాల పునః ప్రారంభమై నెల రోజులు దాటినా పాఠశాలకు రాలేదు. శుక్రవారం లోకేశ్వరి పాఠశాలకు రావడంతో ప్రిన్సిపాల్ వి.నిర్మల టీసీ ఇచ్చి ఇంటికి పంపారు. ఆ విషయమై విద్యార్థిని తల్లిదండ్రులు వసంత, వీరయ్య పాఠశాల వద్దకు చేరుకుని తమ కుమార్తెను తిరిగి పాఠశాలలో చేర్చుకోవాలని ప్రిన్సిపాల్‌ను కోరగా ఆమె ససేమిరా అన్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో శనివారం పాఠశాల వద్దకు వెళ్లిన విలేకరులు లోకేశ్వరి విషయంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరారు. లోకేశ్వరి సక్రమంగా చదవడం లేదని, పాఠ్యపుస్తకాలను చించడం, యూనిఫాం వేసుకోకుండా క్లాసులకు రావడం చేస్తూ ఉండేదని ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. తోటి విద్యార్థినులను కొట్టేదన్నారు. ఈ విషయంపై ఉపాధ్యాయులు, విద్యార్థినులు చాలా సార్లు తనకు ఫిర్యాదు చేశారని తెలిపారు. విద్యార్థిని విషయంపై కమిటీలో చర్చించి టీసీ ఇచ్చి పంపాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. కాగా గురుకుల పాఠశాల సంఘటనపై డీఈఓ ఆదేశాలతో శనివారం సాయంత్రం మైదుకూరు మండల విద్యాశాఖాధికారి పద్మలత పాఠశాలకు చేరుకుని విచారించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడారు. ఆ మేరకు డీఈఓకు నివేదిక పంపుతామని ఎంఈఓ తెలిపారు.

మృతదేహంతో రాస్తారోకో

ఆలంఖాన్‌పల్లె స్మశాన వాటికలో మురుగు నీటిని తక్షణం తొలగించాలని డిమాండ్

కడప కార్పొరేషన్ / కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగర పరిధిలోని ఆలంఖాన్‌పల్లెలో స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మృతదేహంతో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ మాట్లాడుతూ మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఆలంఖాన్ పల్లెలోని డ్రైనేజీ నీరంతా స్మశాన వాటికలో నిలుస్తున్నాయన్నారు. దీనివల్ల స్మశానంలో జమ్ము, బురద నిండిపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చనిపోయిన వారికి గౌరవప్రదంగా భూస్థాపితం చేసేందుకు ఆరు అడుగుల నేల కూడా లేకపోవడం దారుణమన్నారు. 49వ డివిజన్ పరిధిలోని ఆలంఖాన్‌పల్లెకు చెందిన పిడుగు రమేష్ గుండెపోటుతో మృతిచెందిన నేపథ్యంలో పూడ్చేందుకు చోటు లేక ఇలా రహదారిపై ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. ఏళ్ల తరబడి స్మశాన సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ పరిష్కరించడంలో ప్రభుత్వాలు, నగరపాలక అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. స్మశానంలో మురుగునీరు నిలువకుండా ప్రధాన రహదారి పక్కనే దండు మీదుగా రాళ్ల వంకలోకి డ్రైనేజీ కాలువను నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రాస్తారోకో సందర్భంగా జాతీయ రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం జేసీబీ తెచ్చి రోడ్డు పక్కనే గుంత తీసి మృతదేహాన్ని పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు చెంచయ్య, నరసింహులు, పగడపూల మల్లికార్జున, వడ్ల భాగ్యలక్ష్మి, భరత్, అరుణ్, చైతన్య, కేశవ, చెంద్రాయుడు, సుబ్బరాయుడు, రాజేష్, ఆలంఖాన్ పల్లె స్థానికులు పాల్గొన్నారు.



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు